
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY


20
కరీంనగర్
శనివారం ○ 12-8-2017


ఇంక్యుబేటర్లను పరిశీలిస్తున్న కలెక్టర్

సిబ్బంది డబ్బులు అడుగుతున్నారా..?

మాతా శిశుసంరక్షణ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ -సుభాష్‌నగర్ 6లో

ప్రాజెక్టులు కట్టింది ఎక్కడ...

అడ్డుకున్నదెప్పుడు..



- వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పై ఆరోపణలు 8లో
- సీఎం కేసీఆర్‌పై సీఎల్పీ ఉపనేత టీ. జీవన్‌రెడ్డి ఫైర్

\- కరీంనగర్‌టౌన్

సిరిసిల్ల ఎస్పీ విశ్వజిత్‌ను

శిక్షించాలి...



కేసును తప్పుదోవ పట్టించేందుకే లాఠీచార్జ్ డ్రామా 6లో

నేరెళ్ల ఘటనపై డీఐజీ విచారణ నివేదిక బహిర్గతం చేయాలి

బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి బండి సంజయ్‌కుమార్

\- కరీంనగర్‌టౌన్

మరో మలుపు


బాధితులను పరామర్శిస్తున్న మంత్రి కేటీఆర్

నేరెళ్ల ఘటనపై డీజీపీ విచారణకు ఎన్‌హెచ్ఆర్‌సీ ఆదేశం

ఇరకాటంలో అధికార పక్షం

బాధితులు, విపక్షాలలో ఆనందం

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేరెళ్ల ఘటనలో మరో కీలక మలుపు తిరిగింది. ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తెలంగాణ డీజీపీచే విచారణకు ఆదేశించింది. నాలుగు వారాల్లో నివేదిక సమర్పించాలని డీజీపీని ఆదేశించడం కలకలం సృష్టిస్తున్నది. కమిషన్ ఆదేశాలతో అటు బాధితులు ఇటు విపక్షాల నేతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటే అధికారపక్షంలో ఆందోళన మొదలైంది. ఇప్పటికే ఈ ఘటనలో డీఐజీ రవివర్మ విచారణ జరిపి సిరిసిల్ల సీసీఎస్ ఎస్ఐని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.. అయితే ఈ ఘటనలో ఎస్పీ విశ్వజిత్‌తో పాటు మరో 18 మంది పోలీసులను సస్పెండ్ చేయాలని బాధిత కుటుంబాలతో పాటు విపక్షాలు, ప్రజా సంఘాల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో డీజీపీని విచారణకు ఆదేశించడం సంచలనం సృష్టిస్తున్నది.

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి,కరీంనగర్ 8లో




హైదరాబాద్‌లో నేరెళ్ల ఘటనపై ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న టీడీపీ, కాంగ్రెస్ నాయకులు

నేరెళ్ల ఘటనలో ఎస్పీపై చర్యలు తీసుకోవాలి

- న్యాయం కోసం ఎక్కడికైనా వెళ్తాం
- డీజీపీని కలిసిన అఖిలపక్షం

కరీంనగర్ సహకార బ్యాంకుకు

'న్యాఫ్‌స్కాబ్' అవార్డు

చెన్నైలో అవార్డు అందుకున్న బ్యాంకు చైర్మన్ కొండూరు

\- ఆంధ్రజ్యోతి ప్రతినిధి,కరీంనగర్ 20లో

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

దంపతులకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ భార్య మృతి,భర్త పరిస్థితి విషమం

\- చిగురుమామిడి 7లో


అధికారుల తనిఖీల్లో పట్టుబడిన లారీలు

ఓవర్ లోడ్‌పై

కొరడా

ఓవర్ లోడ్, నకిలీ వేబిల్లులపై

ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ముప్పేట దాడి

వారంరోజుల్లో 90 లారీలు సీజ్

\- కరీంనగర్‌టౌన్


6లో

తూనికలు, కొలతలలో మోసాలకు పాల్పడితే

కఠిన చర్యలు

● ఎస్ విజయ్‌కుమార్,
జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి, రాజన్న సిరిసిల్ల



ఇంటర్వ్యూ

సిరిసిల్ల రూరల్ : "రాజన్న సిరిసిల్ల జిల్లాలో తూనికలు, కొలతలలో తేడాలపై తనిఖీలు ముమ్మరం చేశాం.. వ్యాపార వాణిజ్య సముదాయాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రేషన్ గోదాములు, బంగారు దుకాణాలు, పెట్రోలు బంక్‌ల తో పాటు గ్యాస్ ఏజెన్సీలపై దాడులు చేశాం.. ఇప్పటి వరకు 300ల కేసులను నమోదు చేసి జరిమానాలు కూడా విధించాం. వాణిజ్య, వ్యాపార సముదాయాల్లో విక్రయించే ప్రతి వస్తువును ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలి. ప్రతి వస్తువుపైనా కంపెనీ సంబంధించిన డిక్లరేషన్‌తో పాటు పూర్తి అడ్రస్ ఉంటేనే వ్యాపారులు విక్రయించాలి.. అలా లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నాం" అంటూ ఎస్ విజయ్ కుమార్ జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి : తూనికలు, కొలతలపై ఏవిధంగా తనిఖీలు చేస్తున్నారు.?

అధికారి : జిల్లా వ్యాప్తంగా తూనికలు కొలతలపై నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 300లకు పైగా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాం. స్టాంప్ ఫీజు కింద రూ. 4 లక్షల 20 వేల 785 వసూలు చేశాం. కేసులలో రాజీ రుసుము కింద రూ. 2లక్షల 81 వేల 375 వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి : కాంటాలు, కొలతల పాత్రలపై సీల్ వేస్తున్నారా ?

అధికారి : వాణిజ్య వ్యాపార సముదాయాలతో పాటు రేషన్ గోదాములు, దుకాణాలతో పాటు బంగారు దుకాణాలలో తూకాలు, కొలతలకు వినియోగించే వాటిని తనిఖీలు చేస్తున్నాం. మోసాలకు పాల్పడితే యజమానులపై కేసులు నమోదు చేస్తున్నాం. సీల్ లేని వాటికి సీల్ వేసి అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : బంకుల్లో డీజిల్, పెట్రోల్ కొలతల్లో తేడాల మాటేమిటి.?

అధికారి : జిల్లాలో ఉన్న పెట్రోల్ బంకుల్లో ప్రతినెలా తనిఖీలు చేసి కొలతల్లో తేడాలను గుర్తిస్తున్నాం. మేము ఆకస్మిక దాడులు చేయడంతో పాటు వినియోగదారులతో పెట్రోల్, డీజిలను డబ్బాల్లో కొనుగోలు చేయించి తక్కువ వస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తున్నాం.

డ్యాన్స్‌పై

యువత మక్కువ

● ప్రోత్సహిస్తున్న స్టైల్ డ్యాన్స్ అకాడమీ ● 40 మందికి ఉచిత శిక్షణ



క్లాసిక్ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు



వేములవాడ టౌన్: డ్యాన్స్‌పై యువత మక్కువ పెంచుకుంటున్నారు. క్లాసికల్, హిపాప్, బ్రేక్, వెస్టర్న్, ఫోక్ డ్యాన్స్‌లను నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. యువత అభిరుచికి అనుగుణంగా డ్యాన్స్ మాస్టర్‌లు యువతకు, చిన్నారులకు ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారు. సుమారు 40 మంది విద్యార్థులకు డ్యాన్స్ మాస్టర్ హరీష్ ఉచిత శిక్షణను అందిస్తున్నాడు. వేములవాడ పట్టణం లోని సినారె కళామందిర్‌లో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విద్యార్థులకు వివిధ పలు డ్యాన్స్‌ల్లో మెళకువలను నేర్పుతున్నారు. ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నారు. శిక్షణ అందించడంపై పలువురు డ్యాన్స్ మాస్టర్‌ను అభినందిస్తున్నారు. విద్యార్థులకు ముందుగా డ్యాన్స్‌పై ఆసక్తిని గమనించి వారికి ఏ డ్యాన్స్‌పై ఇష్టం ఉంటుందో వాటిపైన శిక్షణను ఇప్పిస్తున్నారు. డ్యాన్స్ చేసేటప్పుడు బాడి లాంగ్వేజ్‌ను, ఎక్స్‌ప్రెషన్స్ ఎలా ఇవ్వాలని విద్యార్థులకు ప్రయోగపూర్వకంగా చూపించడంతో వారికి తొందరగా నేర్చుకునేందుకు వీలుగా ఉంటుందని చెబుతున్నారు. స్టైల్ డ్యాన్స్ అకాడమీ నుంచి ఇద్దరు విద్యార్థులు ఢీ జోడి కార్యక్రమంలో సైడ్ డ్యాన్సర్లుగా ఎంపికయ్యారు.

● వెస్ట్రన్ డ్యాన్స్‌లపై మొగ్గు..

ప్రస్తుతం యువత ఎక్కువగా హిపాప్, బ్రేక్ వంటి వెస్టర్న్ డ్యాన్స్‌లపై మొగ్గు చూపుతున్నారు. స్టైల్ అకాడమీకి చెందిన నవీన్, లక్ష్మణ్‌లు ఇద్దరూ ఢీ జోడీలో సైడ్ డ్యాన్సర్లుగా ఎంపిక కావడంతో ఎక్కువ మంది విద్యార్థులు డ్యాన్స్‌వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం ఎక్కువగా హిపాప్ డ్యాన్స్‌కు ఎక్కువగా డిమాండ్ ఉండటంతో ఎక్కువ మంది విద్యార్థులు ఈ డ్యాన్స్‌పై ఆసక్తి చూపుతున్నారని డ్యాన్స్ మాస్టర్‌లు చెబుతున్నారు.

● బాలికలకు ప్రత్యేక శిక్షణ..

స్టైల్ అకాడమీలో బాలికలు, యువతులు కూడా ఉండటంతో మహిళ డ్యాన్స్ మాస్టర్ మౌనికతో ప్రత్యేక శిక్షణను ఇప్పిస్తున్నారు. సుమారు 18 మంది బాలికలు, చిన్నారులు, యువతులు ప్రతి రోజు డ్యాన్స్ నేర్చుకునేందుకు అకాడమీకి వస్తున్నారు. ఇందులో సీనియర్ గర్ల్స్, సీనియర్ బాయ్స్, జూనియర్ గర్ల్స్, జూనియర్ బాయ్స్‌లుగా ఏర్పాటు చేసి డ్యాన్స్ నేర్పిస్తున్నారు. గర్ల్స్ ఆరుగురు విద్యార్థులు క్లాసికల్ డ్యాన్స్ నేర్చుకుంటున్నారు. వారికి మౌనిక ప్రత్యేక శిక్షణను ఇస్తోంది.

ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం...

● అన్నారం హరీష్, డ్యాన్స్ మాస్టర్ స్టైల్ అకాడమీ



ప్రతిరోజు 40 మందికి డ్యాన్స్ పై శిక్షణ ఇస్తున్నాం. విద్యార్థులు మొదట ఐదు గురు మాత్రమే వుండే వారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య పెరిగింది. గత 9 సంవత్సరాలుగా డ్యాన్స్ చేస్తు మాస్టర్‌గా పని చేస్తున్నాను. ఎక్కువగా హిపాప్, బ్రేక్,వేస్టర్న్ డ్యాన్స్‌లను ఇష్ట పడుతున్నారు.

రాబోయే 'ఢీ' ప్రోగ్రాంకు కాంటెస్టెంట్‌గా వెళ్తాను..

● కీసరి లక్ష్మణ్, ఢీ జోడీ సైడ్ డ్యాన్సర్



ఢీ జోడి కార్యక్రమంలో సైడ్ డ్యాన్సర్‌గా ఎంపికయ్యాను. ఢీ జోడి కార్యక్రమంలో చాలా నేర్చుకున్నాను. ప్రస్తుతం రాబోయే ఢీ ప్రోగ్రాంకు కంటె స్టెంట్‌గా వేళ్లేందుకు ప్రయ త్నం చేస్తున్నాను. మా మాస్ట ర్ హరీష్ చాలా బాగా శిక్షణ ఇస్తున్నారు. కచ్చితంగా ఢీ జోడిలోకి వేళ్లేందుకే ప్రతి రోజు రిహార్సల్ చేస్తున్నాను.

డ్యాన్స్ అంటే ఇష్టం..

● అక్షయ, డ్యాన్స్ విద్యార్థి, వేములవాడ



నాకు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం. ప్రతి రోజు క్రమం తప్పకుండా డ్యాన్స్ క్లాసుకు వస్తాను. నేను క్లాసిక్ డ్యాన్స్ నేర్చుకుంటున్నాను. మా మా స్టర్ మౌనిక క్లాసిక్ డ్యాన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. గణేష్ వేడుకల్లో ప్రోగ్రాంలు చేసేందుకు రిహర్సిల్ చేస్తున్నాం.

కొండగట్టు ఆలయ సమాచారం

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో పూజల వివరాలు

మల్యాల:

1) ఉదయం 4 గంటలకు సుప్రభాతం
2) ఉదయం 4 గంటల నుంచి 5గంటల 30 నిమిషముల వరకు ఆరాధన
3) ఉదయం 5.30 నిమిషముల నుంచి 6 వరకు బాల బోగ నివేదన, హారతి అనుసంధానం.
4)ఉదయం 6 నుంచి సాయంత్రం 4 వరకు ధర్మదర్శనం.
5)ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఆర్జిత సేవలు, నిత్యహారతులు, అభిషేకాలు, అష్టోత్తర శతనామార్చన, సత్యనారాయణస్వామి వ్రతాలు.
6)మధ్యాహ్నం 12గంటల నుంచి 12గంటల 30 నిమిషముల వరకు మహానివేదన, రాజబోగం.
7) మధ్యాహ్నం 12గంటల 30 నిమిషముల నుంచి ఒంటిగంట 30 నిమిముల వరకు సామూహిక భజన, తీర్థ ప్రసాద వితరణ.
8) మధ్యాహ్నం ఒంటి గంట 30 నిమిషముల నుంచి సాయంత్రం



4గంటల 30 నిమిషముల వరకు అష్టోత్తర శతనామార్చన, ధర్మధర్శనం.
9)సాయంత్రం 4గంటల 30 నుండి 6గంటల వరకు స్వామి వారి ఆరాధన, నివేదన అనుసందానం.
10) సాయంత్రం 6నుంచి రాత్రి 8గంటల వరకు ధర్మదర్శనం, కుంకుమార్చన.
11) రాత్రి 8గంటల 30 నిమిషములకు సామూహిక భజన, తీర్థ ప్రసాద వితరణ, కవట బందనం, ఆలయం మూసివేత.

సర్వీస్ రూల్స్ లేక కుంటుపడిన విద్యా వ్యవస్థ

● బోయన్నగారి నారాయణ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



సిరిసిల్ల టౌన్ : ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్య 18 సంవత్సరాల నుంచి న్యాయస్థానంలో ఉండడం మూలంగా రాష్ట్రంలోని విద్యా వ్యవస్థ కుంటుపడింది. దీని మూలంగా విద్యా వ్యవస్థలో పదోన్నతులకు అవకాశం లేకుండా పోయింది.మండల విద్యాధికారి, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, ఉప విద్యాధికారులు, ఎడ్యూకేషన్ అధికారులు, డైట్ కళాశాలఅధ్యాపకులు, ప్యానల్ గ్రేడ్ హెడ్‌మాస్టర్స్‌గా పదోన్నతులు పొందే అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వ పాఠశాలల, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల మధ్య పదోన్నతుల గొడవలు న్యాయస్థానంలో ఉండడం ప్రభుత్వాలు చొరవ తీసుకోలేకపోవడం మూలంగా ఉపాధ్యాయుల్లో నైరాశ్యం నెలకొంది. ఉపాధ్యా యులుగా ప్రారంభమైన జీవితం అదే కేడర్‌లోనే పదవీ విరమణ పొందుతున్నారు.ఉపాధ్యాయుల జీవితాల్లో ఎలాంటి ఎదురుఒదుగు లేకపోవడం వలన వృత్తిపరమైన జీవితం సంతృప్తి కరంగా ఉండడం లేదు. పర్యవేక్షణ చేయాల్సిన డీఈవో, జేఎల్ఎస్ పోస్టులు ఖాళీగానే కొనసాగడంతో పర్యవేక్షణ కరువైంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు చొరవ తీసుకొని ఉమ్మడి సర్వీస్ రూల్స్‌పై కోర్టుల పేరుతో కాలయాపన చేయకుం డా విద్యావ్యవస్థను బాగుపరచాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి.

కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకే గర్వకారణం

● రాష్ట్ర గృహ నిర్మాణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి చిత్ర రాంచంద్రన్

రామడుగు: కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకే గర్వకారణమని సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర గృహ నిర్మాణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి(స్పెషల్ సీఎస్) చిత్ర రాంచంద్రన్ అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ వద్ద కాళేశ్వర్ ప్రాజెక్ట్ 8వ ప్యాకేజ్ కింద చేపడుతున్న అండర్ గ్రౌండ్ టన్నెల్, పంపుహౌజ్, సర్జ్‌పూల్, డెలివరీ పాయింట్ల నిర్మాణాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రాజెక్ట్‌లో ఇంత వరకు చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలను నీటి పారుదల అధికారులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. బంగారు తెలంగాణ సాధనలో భాగంగా


అండర్ టన్నెల్‌లో పనులు పరిశీస్తున్న చిత్రరాంచందర్

ప్రభుత్వం చేపడుతున్న అద్భుత ప్రాజెక్ట్ ప్రజలకు గర్వ కారణంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో 8.5 లక్షల ఎకరాలకు అదనంగా నీరు అందించడానికి ప్రభుత్వం ప్రాజెక్ట్‌లో ప్రత్యేక మార్పులు చేసిందన్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయిలో చేపడితే కోటి ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సాగు, తాగునీటితో పాటు పరిశ్రమలు అభివృద్ధి చెందడంతో తెలంగాణ ప్రజలకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పనులు తనకు ఆశ్చర్యం కలిగించాయన్నారు. లోపలి భాగం టన్నెల్, పంప్‌హౌజ్ సర్జ్‌పూల్ నిర్మాణం, పైన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మిస్తుండడంతో రైతుల భూములకు నష్టం ఉండదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎంతో బహ్మాండంగా తయారవుతోందని కితాబిచ్చారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సీఈ సత్యమూర్తి, ఎస్ఈ మానిక్‌రెడ్డి, డీఈ నర్సింగరావు, శ్రీనివాస్, శర్మ తదితరులు పాల్గొన్నారు.

పదిమంది పేకాట రాయుళ్ల అరెస్టు

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట శివారులో పేకాడుతున్న మానకొండూర్ మండలం ముంజంపల్లికి చెందిన పది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ. 5527ల నగదును స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు.

17 మందికి జైలు, జరిమానా

కరీంనగర్ క్రైం: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 17 మందికి జైలు, జరిమానా విధిస్తూ కరీంనగర్ ఫ్లస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎం రాజు శుక్రవారం తీర్పునిచ్చారు. జక్కుల లక్ష్మణ్‌కు 5, కందె శ్రీధర్‌కు 3రోజుల జైలు, జరిమానా విధించారు. మిగతా 15 మందికి 33,600 రూపాయల జరిమానా విధించారు.

ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్‌వోకు జైలుశిక్ష

కరీంనగర్ లీగల్: ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వరిస్తూ లంచం తీసుకుంటూ పట్టుబడ్డ గ్రామ రెవెన్యూ అధికారి(వీర్‌వో)కు రెండేళ్ల జైలు, 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి పి భాస్కర్‌రావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు ఆదిలాబాద్ పట్టణంలోని తిరుపల్లికి చెందిన చౌటుపల్లి వెంకటేశ్, ఆయన సోదరుడు గణేశ్ తమ తండ్రి పేరుమీద ఉన్న వ్యవసాయ భూములను పట్టా మార్పిడి చేసి పాసుబుక్కులు ఇవ్వాలని 2008 మే 5 రోజున ఆదిలాబాద్ తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకున్నారు. తండ్రి మరణానంతరం కుమారులకు చెందాల్సిన ఆస్తిని పట్టామార్పిడి చేయాల్సిందిగా తహసీల్దార్ 2009 జనవరి 16న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. తహసీల్దార్ ప్రొసీడింగ్స్ ప్రకారం పట్టామార్పిడి జరిగినప్పటికీ పాస్‌బుక్‌లు ఇవ్వడానికి వెయ్యి రూపాయలు లంచం కావాలని గ్రామ రెవెన్యూ అధికారి అంపల్లి రవికాంత్ డిమాండ్ చేశాడు. ప్రభుత్వ ఉద్యోగి అయిన వెంకటేశ్(23) పలుమార్లు రవికాంత్‌ను కలిశాడు. డబ్బులు తప్పకుండా ఇవ్వాలని లేకుంటే పాస్‌బుక్‌లు ఇవ్వనని రవికాంత్ చెప్పాడు. దీంతో వెంకటేశ్ 2009 ఆగస్టు 20న ఏసీబీ అధికారులను ఆశ్రయించగా మరుసటి రోజు ఆదిలాబాద్ సుభాష్‌నగర్‌లోని రవికాంత్ ఇంటి వద్ద వెంకటేశ్ వెయ్యి రూపాయలు లంచం ఇచ్చి బయటకు రాగానే పథకం ప్రకారం వేచి ఉన్న ఏసీబీ డీఎస్పీ లింగారెడ్డి వలపన్ని పట్టుకున్నాడు. సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి భాస్కర్‌రావు నిందితుడైన రవికాంత్(45)కు రెండేళ్ల జైలు, రూ. 5 వేల జరిమానా విధించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

కాల్వ శ్రీరాంపూర్: పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కునారం గ్రామ పరిధిలోని జాఫర్‌ఖాన్‌పేటలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాదగిరి రాజేందర్(21) వివాహం చేసుకునే ఆలోచనతో రెండు లక్షలు ఖర్చు పెట్టి ఇంటికి మరమ్మతులు చేయించాడు. ఈ మధ్యలో రాజేందర్ కిడ్నీలో రాళ్లు రావడంతో కొద్ది రోజులుగా ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. రాళ్లు కరగకపోవడంతోపాటు శస్త్ర చికిత్స చేసుకునేందుకు డబ్బులులేక తీవ్ర మనస్థాపానికి గురైన రాజేందర్ శుక్రవారం తన పంట చేనుకు పత్తి మందు కొడతానని పురుగుల మందు డబ్బాతో చేను వద్దకు వెళ్లాడు. సాయంత్రం చేనులో పడి ఉన్న రాజేందర్‌ను చుట్టు పక్కలవారు, గొర్రెల కాపరులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుటుంబీకులు వచ్చి చూసేసరికి రాజేందర్ అప్పటికే మృతిచెందాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఇదిలా ఉండగా మృతుడి అన్న కూడా శుక్రవారం ఉదయం తన భార్య పుట్టింటికి వెళ్లి రావడంలేదని పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

మాజీ ఏఎస్సై మోహన్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు

కరీంనగర్ క్రైం : ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి అక్రమ వడ్డీ వ్యాపారం చేస్తూ అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు మాజీ ఏఎస్ఐ మోహన్‌రెడ్డిపై కరీంనగర్ ఏసీబీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏసీబీ డీఎస్పీ టి సుదర్శన్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ మండలం రేకుర్తికి చెందిన గొల్లె అలియాస్ గోలి కిష్టయ్య 2009లో ఏఎస్సై మోహన్‌రెడ్డిని అప్పు అడగగా అకౌంటెంట్ జ్ఞానేశ్వర్ ద్వారా 4 శాతం వడ్డీతో 3 లక్షలు ఇచ్చాడు. అప్పు ఇచ్చినప్పుడు బ్లాంక్ చెక్‌లు, ఖాళీ ప్రాంసరి నోట్‌లు, బాండ్ పేపర్లపై సంతకాలు తీసుకొని రేకుర్తి శివారులోని కిష్టయ్యకు చెందిన 11 గుంటల భూమిని మోహన్‌రెడ్డి బావమరిది ఇట్టిరెడ్డి శ్రీపాల్ రెడ్డి పేరిట సేల్‌కంమ్ జీపీఏ చేసుకున్నాడు. కిష్టయ్యకు డబ్బు అవసరముండగా 14 సార్లు మోహన్‌రెడ్డి వద్ద మొత్తం 19.50 లక్షలు తీసుకున్నాడు. 2009 నుంచి 2015 వరకు కిష్టయ్య తీసుకున్న అప్పుకు వడ్డీ కలిపి దాదాపు 40 లక్షలు ఏఎస్సైకి చెందిన బోయవాడ ఫైనాన్స్ కార్యాలయంలో చెల్లించాడు. భూమిని తన పేరున రిజిస్ట్రేషన్ చేసి, చెక్, ప్రాంసరి నోట్, బాండ్ పేపర్లు ఇవ్వాలని మోహన్‌రెడ్డిని కోరాడు. ఇంకా 20 లక్షల అప్పుందని, అది చెల్లిస్తేనే ఇస్తామని, లేదంటే ఇతరులకు విక్రయిస్తామని బెదిరించారు. తన భూమిని కాజేసిన ఏఎస్సై మోహన్‌రెడ్డి, అతడి బావమరిది శ్రీపాల్‌రెడ్డిపై గోలి కిష్టయ్య ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. ఏసీబీ ఉన్నతాధికారుల అనుమతితో కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మత్స్యకార్మికుల అభివృద్ధికి రూ.33కోట్ల మంజూరు

కరీంనగర్ టౌన్: 2017-18, 2018-19 సంవత్సరానికి మత్స్యకారుల అభివృద్ధి పథకాలపై ఎన్‌సీడీసీ స్కీం ద్వారా 33 కోట్ల రూపాయలు 38 కంపోనెంట్స్‌పై జిల్లాకు మంజూరయ్యాయని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పోలు లక్ష్మణ్ తెలిపారు. ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, లైసెన్సుదారులు, మత్స్యకారులకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వాసర ఫంక్షన్‌హాల్‌లో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక సంఘం పచ్చి, ఎండు చేపలు అమ్ముకోవడానికి 10 మంది మహిళలు కలిసి ఒక గ్రూపు చొప్పున మిత్రగ్రూపులు ఏర్పాటు చేసుకొని ఆరు నెలలు 50 రూపాయల చొప్పున కట్టినట్లయితే రివాల్వింగ్ ఫండ్ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఎల్ఎండీ రిజర్వాయర్‌లో 68.40 లక్షల చేపపిల్లలు రెండు విడతలుగా వేయడానికి ప్రణాళిక తయారు చేశామని తెలిపారు. 48.05 లక్షల స్కాంపి రొయ్య విత్తనాలు కూడా వేస్తున్నామని


మాట్లాడుతున్న మత్స్య పారిశ్రామిక సహకారసంఘం జిల్లా అధ్యక్షుడు పోలు లక్ష్మణ్

వెల్లడించారు. మత్స్యకారులు, సొసైటీలు ఎలా నడుచుకోవాలనే అంశంపై, చేపలు పెంచే విధానం, వ్యాధి లక్షణాలు, తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య అధికారి బి దేవేందర్, శాస్త్రవేత్త కేవీకే ప్రభాకర్, కేశవపట్నం మత్స్య అభివృద్ధి అధికారి విజయ్ కిరణ్, మత్స్య అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ బండి వెంకటేశ్వర్లు, 10 మండలాల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, లైసెన్సుదారులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

సెలవుదినాల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

గణేశ్‌నగర్: కరీంనగర్ పట్టణ, గ్రామీణ విద్యుత్ వినియోగదారులు నేటి నుంచి మూడు రోజులు సెలవు దినాలు వచ్చినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లింపు కౌంటర్లు యథావిధిగా కొనసాగుతాయని విద్యుత్‌శాఖ టెక్నికల్ డీఈ ఈశ్వర్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పట్టణ, గ్రామీణ ప్రాంత వినియోగదారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని విద్యుత్ బకాయిలు సకాలంలో చెల్లించాలని తెలిపారు. గడువులోగా విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో నిరసన

టీఆర్ఎస్ పాలనలో చౌకధరల దుకాణాలు నిర్వీర్యమవుతున్నాయని

గణేశ్‌నగర్: టీఆర్ఎస్ పాలనలో చౌకధరల దుకాణాలు పూర్తిగా నిర్వీర్యమవుతున్నందుకు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నగర టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పార్టీ అధ్యక్షుడు కళ్యాడపు ఆగయ్య మాట్లాడుతూ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ప్రజా పంపిణీ వ్యవస్థను ఏ మాత్రం పటిష్ట పర్చకుండా ఆ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చౌకధరల దుకాణాల్లో పేదలకు కావాల్సిన అన్ని సరుకులను పంపిణీ చేస్తే టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నామమాత్రంగా బియ్యం పంపిణీ తప్ప ఉప్పు, పప్పు, చింతపండు, చక్కర, కిరోసిన్, పసుపు, పామాయిల్ వంటి అనేక రకాల సరుకులను పంపిణీ చేయకుండా రద్దు పర్చడం సిగ్గు చేటైన విషయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు సందబోయిన రాజేశం, ఎస్‌కె సలీం, సాయిల్ల రాజమల్లయ్య, ప్రధాన కార్యదర్శి తీగుట్ల రమేశ్‌కుమార్, కార్యదర్శులు బొబ్బల విద్యాసాగర్‌రెడ్డి, ఎర్రబెల్లి రవీందర్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ నాయకుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, నగర టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు సాయి తేజ, నగర ఎస్సీ సెల్ కార్యదర్శి పోతుల రమేశ్, కార్యవర్గ సభ్యులు తుంగ బాబు, నగర బీసీ సెల్ అధ్యక్షుడు ఎనుగుర్తి ఆంజనేయులు, పార్టీ నాయకులు డాక్టర్ పి నర్సింహాచారి, సాయికృష్ణ, మేకల రాయమల్లు, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ చౌక్‌లో ధర్నా చేస్తున్న టీడీపీ నాయకులు

ఎస్సారార్‌లో నీరు, నేల విశ్లేషణపై సర్టిఫికెట్ కోర్సు

గణేశ్‌నగర్: ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నీరు, నేల విశ్లేషణపై సర్టిఫికెట్ కోర్సును 22న ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి నితిన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి లెఫ్టినెంట్ ఆర్ సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. నీటి నాణ్యతను నేల లక్షణాల గురించి అవగాహన కల్పించుటలో భాగంగా 3 నెలల సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఆధారంగా నీటి శుద్ధి కేంద్రాలలో నేల పరీక్షా కేంద్రాలలో వీరికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 21వ తేదీ లోగా 9912099901, 9963329249లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం


నినాదాలు చేస్తున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

సుభాష్‌నగర్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ విజయవంతం అయిందని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాతంగి రమేశ్, కెెడబ్ల్యు ఇంచార్జి బొర్ర భిక్షపతి తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని విద్యా సంస్థలు బంద్ పాటించినట్లు తెలిపారు. కేసీఆర్ నేతృత్వంలో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానిపై ఒత్తిడి తీసుకరావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి తాండ్ర శ్రీనివాస్, ఎంఆర్‌పీఎస్ నాయకులు గోష్కి అజయ్‌కుమార్, శంకర్, సిహెచ్ విష్ణు, నవీన్, రమాకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పైడి జయరాజ్‌కు కఫిసో నివాళి


పైడి జయరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కరీంనగర్ కల్చరల్: దాదాసాహెబ్ పాల్కే అవార్డు గ్రహీత, తెలంగాణ సినీతేజం పైడి జయరాజ్ 17వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఫిలింభవన్‌లో కరీంనగర్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అధ్యక్ష, కార్యదర్శులు మాడిశెట్టి గోపాల్, పొన్నం రవిచంద్రలు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయరాజ్ పేరిట తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేసి జాతీయస్థాయిలో అవార్డు నెలకొల్పాలని అన్నారు. హిందీ చలనచిత్ర రంగంలో తనకంటూ ఓ చెరగని ముద్ర వేసుకున్నారని, తెలంగాణ కీర్తిని దశదిశలా చాటారని కొనియాడారు. కార్యక్రమంలో సయ్యద్ ముజాఫర్, వరాల మహేశ్, అనుముల దయాకర్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాలలో ఎన్నికలు

కరీంనగర్ కల్చరల్: మంకమ్మతోటలోని కాకతీయ టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల హెడ్‌బాయ్, హెడ్ గర్ల్స్, గ్రూప్ కెప్టెన్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జార్జిరెడ్డి, కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎన్నికలలో గెలిచిన విద్యార్థులతో ప్రమాణం స్వీకారం చేయించారు.

పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

సుభాష్‌నగర్: సర్దార్ సర్వాయిపాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ కోరారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో సర్వాయి పాపన్న 367వ జయంతి ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18 నిర్వహించనున్న పాపన్న జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశచరిత్రలో 17వ శతాబ్దంలోనే దళిత, బీసీల పది వేల సైన్యంతో నిజాం నవాబు చేస్తున్న అరాచకాలను ఎదిరించి పోరాడారని తెలిపారు. రాబోయే తరానికి పాపన్న గురించి తెలియడానికి ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని కోరారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల ప్రసాద్, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల శ్రీనివాస్, ఉయ్యాల శ్రీనివాస్, హుజూరాబాద్, సైదాపూర్ మండల అధ్యక్షులు కుర్ర శ్రీనివాస్, పూదరి శ్రీకాంత్, బత్తిని తిరుపతి, ముత్యం అంజయ్య, పొన్నం రాజు గౌడ్, పొన్నం శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

'విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి'

కరీంనగర్ టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ నగర అధ్యక్షుడు బేతి మహేందర్ రెడ్డి కోరారు. శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద బీజేపీ ఉత్సవాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆయనతో బీజేపీ నగర ప్రధాన కార్యదర్శి బండ రమణారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ప్రవీణ్‌రావు, బీజేపీ నగర ఉపాధ్యక్షులు ముప్పిడి సునీల్‌కుమార్, జెల్లో జు చిట్టిబాబు, నాయకులు ఆకుల నరేశ్, కచ్చు రవి, ఎండీ పర్వేజ్, పసుల విజయ్‌కుమార్ ఉన్నారు.

టీవీవీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

గణేశ్‌నగర్: కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల భవిష్యత్ పట్ల మృత్యు నిలయాలుగా మారాయని, హైదరాబాద్‌లోని బండ్లగూడ నారాయణ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న శ్రావ్య ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ టీవీవీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజ్ ఎదుట ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా టీవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కొరిమి సూర్యుడు మాట్లాడుతూ కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు ఒత్తిడి తట్టుకోలేక, లక్షలకు లక్షలు ఫీజులు కట్టలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో టీవీవీ నాయకులు సంతోష్, రాజు, హిందు, నవ్య, తదితరులు పాల్గొన్నారు.


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీవీవీ నాయకులు

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్: నగరంలో సబ్‌స్టేషన్ల మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఆపరేషన్ ఏడీఈ అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ సిటీలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, టౌన్-5 సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కాపువాడ, మారుతీనగర్, శనివారం మార్కెట్, అశోక్‌నగర్, టౌన్-1 పరిధిలోని డాక్టర్ స్ట్రీట్, సవరన్ స్ట్రీట్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి మనగుడి

కరీంనగర్ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మనగుడి శనివారం నుంచి మూడు రోజులపాటు జరుగనున్నట్లు ప్రోగ్రాం అసిస్టెంట్ టి గోపీబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ధర్మప్రచార మండలి సాయంతో 13 నియోజకవర్గాల్లో మనగుడి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేడు ఆలయాల శుద్ధి, 13న నగర సంకీర్తన, 14న ఉదయం గోపూజ, సాయంత్రం ఉట్టి వేడుకలు జరుపాలని కోరారు. భక్తులు, ఆలయాల నిర్వాహకులు కలిసి ఈ మనగుడిని విజయవంతం చేయాలని కోరారు.

'జేఏసీ చైర్మన్ కోదండరామ్ అరెస్టు అప్రజాస్వామికం'

కరీంనగర్ టౌన్: తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరామ్ తలపెట్టిన అమరుల స్ఫూర్తియాత్రను పోలీసులు అడ్డుకొని ఆయనతో పాటు యాత్రలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులను అరెస్టు చేయడం అప్రజాస్వామిక చర్య అని టీజేఏసీ రీజినల్ కోఆర్డినేటర్ జక్కోజు వెంకటేశ్, జిల్లా చైర్మన్ ముక్కెర రాజు, కన్వీనర్ జె.రవీందర్, కో చైర్మన్ మార్వాడి సుదర్శన్ ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజాస్వామ్యబద్ధంగా చేపడుతున్న యాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందనచూసి జీర్ణించుకోలేకే సీఎం కేసీఆర్ అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అరెస్టులతో యాత్రలను అడ్డుకోలేరని, ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి

జమ్మికుంట రూరల్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు టీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని టీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాజి కుమార్‌స్వామి అన్నారు. శుక్రవారం పట్టణంలో టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పాటు పడుతుందని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి కొమ్ము అశోక్, నాయకులు దబ్బెట రాజు, చిరంజీవి, రాజు, నరేష్, అనిల్, అఖిల్, సంపత్‌లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఆధ్వర్యంలో పునరావాసం చెక్కుల పంపిణీ


ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కిరాణం షాపు ఏర్పాటు

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్, గణేష్‌నగర్ కాలనీల్లో ఎక్సైజ్ పోలీసుశాఖ ఆధ్వర్యంలో గతంలో గుడుంబా విక్రయించిన వారికి పునరావాసం కింద రూ. 2 లక్షలతో కిరాణం షాపును ఏర్పాటు చేశారు. ఈ కిరాణం షాపును నగర పంచాయతీ కమిషనర్ వెల్దండి సమ్మయ్య, చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, సీఐ దుర్గాభవానీలు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సీఐ దుర్గాభవానీ మాట్లాడుతూ ప్రభుత్వం గుడుంబా విక్రయదారులకు పునరావాసం కింద రొంటాల సుభద్ర, షడమాకి రాజనర్సులకు ఒక్కొక్కరికి రూ. 2లక్షల చొప్పున అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రవీందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్: రేపు జిల్లా కేంద్రంలో నిర్వహించే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలనిజామే మసీదు, ఈద్గా, ఖబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం శాంతి ర్యాలీ వాల్ పోస్టర్, కరపత్రాలను ముస్లిం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కుల ఐక్యతను ఈ ర్యాలీ ద్వారా చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ అజీజ్, గులాంగౌస్‌ఖాన్, సయ్యద్ అజీమ్, షేక్‌నయీం, మీర్జాఇమ్రాన్‌బేగ్,మహ్మద్ జాఫర్, మహ్మద్ అసన్‌షరీఫ్, యూసుఫ్‌ఖాన్, రఫి, ముజారోద్దీన్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనం

ఇల్లందకుంట: జేఏసీ చైర్మన్ కోదండరాంను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ జేఏసీ నియోజకవర్గ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా టీ జేఏసీ హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుమార్, సాగర్, రఘు, మహేందర్,నిరంజన్, రమేష్, శ్రీహరిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు బ్యాంకుల సేవలు వినియోగించుకోవాలి

సైదాపూర్: ప్రజలు బ్యాంకుల సేవలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఎలబోతారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు స్పెషల్ అధికారి మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బొమ్మకల్ గ్రామ ప్రజలకు, రైతులకు బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు.కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ జీయూఎం శర్మ, సర్పంచ్ ఏరుకొండ ఇందిర -సుధీర్, ఎంపీటీసీ నారాయణ, రైతులు, ప్రజలుపాల్గొన్నారు.

నేడు సింగాపూర్‌కు కలెక్టర్ రాక

హుజూరాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా నేడు మండలంలోని సింగాపూర్ గ్రామంలో మొక్కలు నాటేందుకు జిల్లా కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ హాజరు కానున్నట్లు పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో గుంతలు తీయించారు. మొక్కలు నాటే స్థలాన్ని ఏపీడీ గూడూరి రాంరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పరిశీలించారు.

కోదండరాం అరెస్టు అప్రజాస్వామికం

హుజూరాబాద్: కోదండరాంను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని టీజేఏసీ జిల్లా చైర్మన్ ముక్కెర రాజు, కన్వీనర్ జె రవీందర్, హుజూరాబాద్ జేఏసీ నాయకులు ఆవునూరి సమ్మయ్య, రత్నం, జనార్ధన్, చక్రధర్, చిరంజీవిలు అన్నారు.

వినాయక చవితికి సిద్ధమైన గణనాధులు

- పెరిగిన ధరలు
- డిమాండ్ ఉంటేనే లాభమంటున్న తయారీదారులు

హుజూరాబాద్ టౌన్: ఈనెల 25న జరుగబోయే వినాయక చవితికి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. హిందువులు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే వినాయక నవరాత్రోత్సవాలకు విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. తయారీదారులు విగ్రహాలను తయారు చేసి రంగులను అద్దుతున్నారు.యువతతో పాటు సీనియర్ సిటిజన్ల భక్తి భావం పెరుగుతడంతో వాడవాడలా వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో నవరాత్రులు పూజించి నిమజ్జనం చేస్తారు. అయితే గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ముడి పదార్థాలు ధరలు పెరిగాయాని దీంతో విగ్రహాల ధరలను కూడా పెంచాల్సి వస్తుందని నిర్వాహకులు అంటున్నారు. రాజస్థాన్ రాష్ట్రం నుంచి ఈ ప్రాంతాలకు వచ్చి ఎంతో శ్రమకోర్చి డబ్బులు వడ్డీకి తెచ్చి విగ్రహాలను తయారు చేస్తున్నారని తయారీ దారులు తెలుపుతున్నారు. 4ఫీట్ల నుంచి 10ఫీట్ల వరకు విగ్రహాలు తయారు చేస్తున్నామని వాటిధర రూ.2వేల నుంచి 12వేల వరకు ఉంటుదన్నారు.కష్టపడి 4నుంచి 5లక్షల వరకు పెట్టుబడి పెట్టి తయారుచేస్తే రూ.50వేల వరకు లాభం వస్తుందని, ఒకవేళ డిమాండ్ ఉంటేనే కాస్త ఎక్కువ లాభం వస్తుందన్నారు.


వినాయక విగ్రహానికి రంగులు అద్దుతున్న యువకుడు


విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

● అన్ని విక్రయిస్తేనే లాభం
- ఖానారాం, తయారీదారుడు



6-8నెలల పాటు విగ్రహాలను తయారు చేస్తాం. సుమారు రూ. 4లక్షల నుంచి రూ. 5లక్షల వరకు పెట్టుకు అవుతుంది. పెట్టుబడి కోసం వడ్డీ తీసుకొచ్చి విగ్రహాలు తయారు చేస్తాం. తయారు చేసిన విగ్రహాలను పూర్తిగా విక్రయిస్తేనే లాభం ఉంటుంది. లేకుంటే తక్కువమొత్తంలో లాభం వస్తుంది.

● పెట్టుబడులు పెరిగాయి
- అమర్, తయారీదారుడు



గత సంవత్సరం కంటే ఈ సంత్సరం ప్రతి వస్తువుకు ధర పెరిగింది. దీంతో విగ్రహాల తయారీకి కావల్సిన ముడి పదార్థాల ధరలు పెరగడంతో విగ్రహాల ధరను పెంచి అమ్మాలి. విగ్రహాల డిమాండ్ ఎక్కువగా ఉంటే లాభం, చేసిన కూలీ, వడ్డీ గిట్టుబాటు అవుతుంది. లే కుంటే నష్టాలు వస్తాయి. ఇక్కడ విగ్రహాలను విక్రయించి రాజస్థాన్‌కు వెళ్లిపోతాం.

ఆకట్టుకున్న అంధుల గానం



పాటలు పాడుతున్న అంధులు

హుజూరాబాద్ టౌన్: వారు అంధులైనప్పటికి వారి గొంతు కోకిలను తలపిస్తోంది. వారు కళ్లతో ప్రపంచాన్ని చూడనప్పటికి వారిగొంతుతో ప్రపంచంలోని వింతలను, పోకడలను, బాధలను, సంతోషాన్ని కళ్లుండి చూడలేని వారికి చూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విశాఖపట్నం జిల్లా మధురవాడ సాయిసంగీత అన్ ఎంప్లయిడ్ మ్యూజికల్ ఆర్కెస్ట్రా ఫర్ బ్లైండ్ సభ్యులు హుజూరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారి పక్కన మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహించారు. వారు అంధులైనప్పటికి వారి గొంతుతో చుట్టూ పక్కల నుంచి వెళ్తున్న వారిని కట్టిపడేశారు. వారు పాడిన పాటలు శ్రోతలను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. వచ్చిన ప్రజలు వారికి తోచినంత విరాళాలు అందజేశారు. పలువురు మాట్లాడుతూ అంధులైనప్పటికి మానసికంగా కృంగిపోకుండా తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ మొక్కవోని ధైర్యంతో ముందుకెళ్తున్నారని అభినందించారు. ఈ అంధులు పీజీలు చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న వారు కావడం గమనార్హం.

వాడివేడిగా సర్వసభ్య సమావేశం

వీణవంక: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కర్రజయ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సగానికి పైగా అధికారులు హాజరుకాకపోవడంతో అధికారుల పనితీరుపై ఆగ్రహంవ్యక్తం చేసింది. గైర్హాజరైన అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. భేతిగల్ సర్పంచ్ సంపత్‌రావు మాట్లాడుతూ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు తాము ఓ చోట సూచిస్తే అధికారులు ఇష్టానుసరంగా వేరే చోట వేశారన్నారు. చల్లూరు సర్పంచ్ తాండ్ర శంకర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పనులు నత్తనడకన సాగుతున్నాయని, గుట్టను ధ్వంసం చేయడం వల్ల ఎలుగుబంట్లు గ్రామంలోకి వస్తున్నాయని విద్యుత్ అధికారులు గుట్టల చుట్టూ విద్యుత్ దీపాలు పెట్టాలనివారు సూచించారు.సభకు అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి స్థాయిలో హాజరు కాకపోవడంతో సభ వాడివేడిగా జరిగింది. కార్యక్రమంలో జడ్పీటీసీ దాసరపు ప్రభాకర్, ఎంపీడీవో భాస్కర్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్ర జయ

బోర్నపల్లిలో ఒకరికి డెంగ్యూ లక్షణాలు

దోమల మందు పిచికారి చేసిన అధికారులు

హుజూరాబాద్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన జి రవీందర్ హైద్రాబాద్ నుంచి జ్వరంతో రాగా రక్త పరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలుపడంతో ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఈవిషయం తెలుసుకున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది శుక్రవారం గ్రామంలోని రవీందర్ ఇంటి చుట్టూ పక్కల నీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణకు పైరిథ్రమ్ స్ప్రేచేశారు.

మురికి కాలువలో దోమలు నిల్వ ఉండకుండా అబేట్ స్ప్రేచేసినట్లు ఎం రా మానందం, ఎంఏ రఫిక్, కెసంజీవరెడ్డి, కె సదానందం, బి రాణి, సర్పంచ్ స్వరూప-సమ్మారావులు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ఇల్లందకుంట: మండలంలోని కొత్తపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరాములపల్లి, ఇల్లందకుంట, ధర్మారం, శాయంపేట, నాగంపేట గ్రామాలకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో రూరల్ ఏఈ బోగం రవీందర్ తెలిపారు. సబ్‌స్టేషన్లో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

రూ.5300లు పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.5300లు పలికింది. శుక్రవారం స్థానిక మార్కెట్‌కు 623క్వింటాళ్ల పత్తి, 41క్వింటాళ్లు గోనే సంచుల్లో రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. గరిష్ట ధర రూ. 5300, సగటు ధర రూ.5వేలు, నికర ధర రూ. 4850చెల్లించి ప్రైవేట్ ట్రేడర్స్ పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

సర్వాయి పాపన్న జయంతి పోస్టర్ ఆవిష్కరణ

హుజూరాబాద్ టౌన్: ఈనెల 18న జిల్లాలోని అన్ని గ్రామాల్లో దళిత బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయిపాపన్నగౌడ్ జయంతిని విజయవంతం చేయాలని తెలంగాణ గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పరకాల రవీందర్‌గౌడ్ కోరారు. శుక్రవారం జయంతి పోస్టర్‌ను హుజూరాబాద్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర శ్రీనివాస్ గౌడ్, నేరేళ్ల మహేందర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, జూపాక సదానందంగౌడ్, తీగల శ్రీనివాస్, పంజాల తిరుపతి, తాడూరి శ్రీనివాస్, పూదరి శ్రీకాంత్, పైడిపల్లి రవీందర్, బప్పన్న, నవీన్, తాళ్లపల్లి వెంకటేశం, కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తోకలపల్లె గ్రామానికి చెందిన మాదాని సాంబయ్య కులంపేరుతో దాడికి ప్ర యత్నించగా అతనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు న మోదు చేశామని టౌన్ సీఐ వీవీ రమణామూర్తి తెలిపారు. అదేగ్రామానికి చెందిన దళితుడైన కదిరే అయిలయ్యను సాంబయ్య కులం పేరుతో దూషించడంతో పాటు దాడికి పాల్పడ్డాడని బాధితుడు అయిలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఉపరాష్ట్రపతి ఎంపికపై న్యాయవాదుల సంబరాలు

కరీంనగర్ లీగల్: భారత ఉపరాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టులోని బీజేపీ న్యాయవాదులు సంబరాలు జరుపుకొని మిఠాయిలు పంపిణీ చేశారు. బీజేపీ లీగల్‌సెల్ కన్వీనర్ సంగెం రాంచందర్‌రావు, కో-కన్వీనర్ గంట సతీష్, న్యాయ విభాగం కన్వీనర్ శ్రావణ్‌కుమార్, న్యాయవాదులు రాజ్‌కుమార్, విశ్వప్రసాద్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. వెంకయ్య నాయుడు ఉపరాష్ట్రపతిగా ఎంపిక కావడం తెలుగువారికి గర్వకారణమన్నారు.

కరీంనగర్‌లో మిషన్ భగీరథకు శ్రీకారం

- 'శాతవాహన'లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం
- హౌసింగ్ బోర్డుకాలనీ, రాంనగర్‌లలో అదనపు రిజర్వాయర్ల నిర్మాణం
- రూ.105 కోట్ల వ్యయంతో ఇంటింటికీ నల్లా నీరు : మేయర్


మిషన్ భగీరథ పనులను ప్రారంభిస్తున్న మేయర్, కమిషనర్ శశాంక

కరీంనగర్ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మిషన్ భగీరథ పథకం పనులకు కరీంనగర్‌లో శుక్రవారం మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ శ్రీకారం చుట్టారు. ఈ పథకం కింద కరీంనగర్‌కు 105 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటితో నగరంలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు ప్రణాళికను రూపొందించారు. దిగువ మానేరు రిజర్వాయర్ (ఎల్ఎండీ) సమీపంలో 56 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఫిల్టర్‌బెడ్స్ ఉండగా 10 రిజర్వాయర్ల ద్వారా నల్లా నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి కాకుండా మిషన్ భగీరథ పథకం కింద శాతవాహన యూనివర్శిటీ ప్రాంగణంలో ఒక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను, రాంనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో రిజర్వాయర్లను నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న పైపులైనును అనుసంధానం చేస్తూ 200 కిలో మీటర్ల నిడివిలో డిస్ట్రిబ్యూటరీ పైపులైను వేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అయితే ఇప్పటికే శివారుకాలనీల్లో పైపులైను పనులను పూర్తి చేసినప్పటికీ రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టకపోడంతో పైపులైను వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో నగర మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఇందుకు సంబంధించిన అధికారులతో చర్చించి ఏడాదిలోగా పనులు పూర్తయ్యే విధంగా పనులను వెంటనే ప్రారంభించాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో శుక్రవారం 21వ డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డుకాలనీలో నగరపాలక సంస్థ కమిషనర్ కె.శశాంక, ఆ డివిజన్ కార్పొరేటర్ ఆకుల ప్రకాశ్‌తో కలిసి మేయర్ రవీందర్ సింగ్ మిషన్ భగీరథ కింద రిజర్వాయర్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా మేయర్ రవీందర్‌సింగ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన నల్లానీటిని అందిస్తామని, లేనిపక్షంలో ఓట్లు అడగమని సాహసోపేతమైన ప్రకటన చేశారన్నారు. ఆయన మాటను నిలబెట్టే విధంగా ఏడాదిలోగా పనులన్నిటినీ పూర్తి చేసేందుకు తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ఇప్పటికే స్మార్ట్‌సిటీకి వేగంగా అడుగులు వేస్తున్నామని, మరోవైపు దశాబ్దకాలంగా నత్తనడకన సాగుతున్న యూజీడీ పనులను పూర్తి చేసేందుకు 25 కోట్ల రూపాయలను మంజూరు చేయించామని చెప్పారు. రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనులు, సుందరీకరణ పనులు కూడా చురుకుగా సాగుతున్నాయని, ఏడాదిలోగా పనులు పూర్తయితే రాష్ట్రానికే తలమానికంగా కరీంనగర్ రూపుదిద్దుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మాజీద్ అలీ, నాయకులు ఎడ్ల అశోక్, మున్సిపల్, ప్రజారోగ్యశాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

కల్లు గీత వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వామి



సుభాష్‌నగర్: తెలంగాణ గౌడ కల్లు గీత వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్వామిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మల్యాల రాజు ఉత్తర్వులను జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య నగర కన్వీనర్‌గా సంగీత



సుభాష్‌నగర్: తెలంగాణ జాగృతి మహిళా సమాఖ్య నగర కన్వీనర్‌గా పిన్నింటి సంగీతరెడ్డిని నియమిస్తూ జిల్లా కన్వీనర్ అంకం శివరాణి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి సంగీత కృతజ్ఞతలు తెలిపారు.


లయన్స్ క్లబ్ పండ్ల పంపిణీ

సుభాష్‌నగర్: శాతవాహన లయన్స్ క్లబ్ బాధ్యుడు బి వెంకటరాజగోపాల్‌రెడ్డి జన్మదిన సందర్భంగా శుక్రవారం శాతవాహన లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయ అనాధాశ్రమంలోని పిల్లలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు డి రవందర్‌రావు, బి మధుసూధన్‌రెడ్డి, రాంచందర్‌రావు, తిరుపతిరెడ్డి, వి శ్రీనివాస్, వెంకటరాజ్‌గోపాల్‌రెడ్డి, గాలిపెల్లి వెంకట్ పాల్గొన్నారు.

● పాల వితరణ..

సహాయ అనాథ ఆశ్రమానికి శాతవాహన లయన్స్ క్లబ్ సభ్యులు వడ్లూరి శ్రీనివాస్ ఆయన సతీమణితో కలిసి 30 లీటర్ల పాలను వితరణ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకురాలు మాట్లాడుతూ ప్రతి నెల పిల్లల కోసం 2 క్వింటాళ్ల బియ్యం అవసరమవుతాయని దాతలు ముందుకు వచ్చి తోడ్పాటునందించాలని కోరారు.

రేయింబవళ్లూ వెలుగుతున్న వీధిదీపాలు



కరీంనగర్ టౌన్: కార్పొరేషన్ వారు ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి దీపాలు పగలే ప్రకాశిస్తూ వెన్నెలను తలపిస్తున్నాయి. మూడు రోజుల నుంచి సంతోష్‌నగర్, శ్రీహరినగర్‌లలో మధ్యాహ్నం, రాత్రి వెలుగుతూనే ఉన్నాయి. మూడు రోజులు అధికారులుగాని, సిబ్బందిగాని స్పందించకపోవడం శోచనీయం. ఏదైనా విద్యుత్ మరమ్మతులు జరుగుతున్నాయనుకుంటే అది కూడా కాదు. దారిన పోయేవారంతా ముక్కున వేలేసుకుంటుంటే మరికొందరు మధ్యాహ్నం కూడా ఇలా వెలగడం వల్ల బిల్లులు కట్టేది ప్రజలేనని కార్పొరేషన్‌వారు గుర్తించాలని కోరుతున్నారు. పాత వీధిదీపాలు సైతం దేదీప్యమానంగా వెలుగుతుండడం ఒకింత ఆశ్చర్యం, విడ్డూరాన్ని కలిగిస్తుంది.

ప్రధాని మోదీ, ఆర్ కృష్ణయ్య చిత్రపటాలకు క్షీరాభిషేకం

గణేశ్‌నగర్: బీసీ రిజర్వేషన్లు, సమస్యలపై సానుకూలంగా స్పందించిన ప్రధాని మోడీ, ఆర్ కృష్ణయ్య చిత్రపటాలకు తెలంగాణ రాష్ట్ర బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ టి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌక్‌లో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై సానుకూలంగా స్పందించిన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామన్నారు. బీసీ కమిషన్‌కు చట్టబద్ధమైన హక్కులు కల్పించడానికి, కేంద్రంలో బీసీలకు ప్రత్యేకమైన మంత్రిత్వశాఖ ఏర్పాటుకు, ఉద్యోగాల్లో బీసీల రిజర్వేషన్ల సాధనకు అహర్నిశలు కృషి చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ ృష్ణ ఆధ్వర్యంలో బీసీలంతా ఏకమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీధర్‌రాజు, అర్జున అవార్డు గ్రహీత మాదాసు శ్రీనివాసరావు, బీసీ యువజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు రణధీర్‌సింగ్, నాయకులు నర్సింగోజు శ్రీనివాస్, జిల్లా అధయక్షులు జక్కని సంజయ్ కుమాంర్, శ్రీరాముల శ్రీకాంత్, రవీంద్రాచారి, పిట్టల రమేశ్, శ్రీనివాస్, రఘు, క్రాంతి, ప్రేమ్‌కుమార్, అనిల్, అశోక్ పాల్గొన్నారు.

అకౌంటింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ ముగింపు


సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న మేనేజ్‌మెంట్

గణేశ్‌నగర్: స్టేట బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ తిమ్మాపూర్, కరీంనగర్‌లో 30 రోజుల పాటు జరిగిన కంప్యూటరరైజ్‌డ్ అకౌంటింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లీడ్ డిస్ట్రిక్స్ మేనేజర్ రాజయ్య హాజరై అభ్యర్థులకు ధృవ పత్రాలను ప్రదానం చేశారు. ఫ్యాకల్టీ ఆర్ తిరుపతి, ఎస్ స్వప్న, ఆఫీస్ సిబ్బంది ఎం విజయ్‌కుమార్‌రెడ్డి, జె రమేశ్, ఎ ఆనందకిశోర్, ట్రైనర్స్ ఎం నర్మద, స్వర్ణ పాల్గొన్నారు.

ఎంపీ వినోద్‌కుమార్ వివాహ వార్షికోత్సవం

గణేశ్‌నగర్: కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాధవిల 27 వివాహ వార్షికోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో కార్ఖానగడ్డలోని వృద్ధుల ఆశ్రమంలో శుక్రవారం పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో టీఆర్ఎస్‌వీ నాయకులు శ్రీనాథ్ గౌడ్, బండ వేణ యాదవ్, మణిదీప్, శివయాదవ్, కార్తీక్, శివ, ప్రదీప్, ప్రశాంత్, స్వామి, సంతోష్, కళ్యాణ్, అనిల్, వేణు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో వాహనదారుడికి మూడు నెలల జైలుశిక్ష

● జిల్లా చరిత్రలో మొదటిసారి

కరీంనగర్ క్రైం: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలో పట్టుబడిన రామడుగు మండలం గోలిరామయ్యపల్లి గ్రామానికి చెందిన చిందం మల్లేశంకు కరీంనగర్ ఎక్సైజ్ మేజిస్ట్రేట్ మూడు నెలల జైలుశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పువెలువరించారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మూడు నెలల జైలు శిక్ష పడడం ఇదే మొదటిసారి. ఇటీవల రామడుగు పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మల్లేశం మోతాదుకు మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ మేరకు రామడుగు ఎస్ఐ కోర్టుకు అందజేసిన వీడియో, ఫోటోల సాక్ష్యాల ఆధారంగా మేజిస్ట్రేట్ ఈ తీర్పును వెలువరించారు. చిందం మల్లేశంకు రామడుగు పోలీసులు నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 100 మిల్లీ లీటర్లలో 240 మిల్లీ గ్రాముల అల్కాహాల్ ఉన్నట్లు బీఏసీ రిపోర్టును కూడా పోలీసులు కోర్టుకు సాక్ష్యం కింద అందజేశారు. గతంలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నెల రోజుల వరకు శిక్షలు పడిన సందర్భాలున్నాయి. మొట్ట మొదటిసారిగా మూడు నెలల జైలుశిక్ష పడటం గమనార్హం. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసులు ఒకవైపు ప్రచారం చేస్తూనే మరోవైపు తనిఖీలను తీవ్రతరం చేసి రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఒకరికి అత్యధికంగా మూడు నెలల జైలు శిక్ష పడింది.

స్వాతంత్ర్య దినోత్సవాలకు ఎస్సారార్ ఎన్‌సీసీ కెడెట్ ఎంపిక



కరీంనగర్ స్పోర్ట్స్: సికింద్రాబాద్, బైసాన్ మైదానంలో జరిగే రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలకు చెందిన సీనియర్ ఎన్‌సీసీ కెడెట్ పి అరుణ్ కుమార్ ఎంపికైనాడని కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రేల్ల సంజీవ్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవంలో సాధారణ పరేడ్, సెర్మోనియం డ్రిల్‌లో పాల్గొంటాడని తెలిపారు. గవర్నర్, సీఎంకు జరిగే గౌరవ వందన కార్యక్రమలో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ నితిన్, కమాండింగ్ అధికారి కల్నల్ దేశ్‌పాండే, ఏవో ఉమాశంకర్, లెఫ్టినెంట్ ఆర్ సంజీవ్, ఉపన్యాసకులు డాక్టర్ మల్లారెడ్డి, సత్యప్రకాశ్, రవీందర్‌రావు, శ్రీనివాస్, రాంచందర్‌రావు అభినందించారు.

మీ ప్రాంతంలో జరిగే సభలు, సమావేశాలు తదితర కార్యక్రమాల వివరాలను మాకు తెలపండి. WhatsApp

విలేకరుల ఫోన్ నంబర్లు

మానకొండూర్	91005 73922
తిమ్మాపూర్	88863 61515
శంకరపట్నం	98665 69102
గన్నేరువరం	94413 92974
చిగురుమామిడి	94402 84269

విద్యార్థులే మొక్కల సంరక్షకులు

● **స్వచ్ఛభారత్ జిల్లా కో-ఆర్డినేటర్ కిషన్‌స్వామి**

మానకొండూర్: విద్యార్థులే మొక్కల సంరక్షకులని స్వచ్ఛభారత్ జిల్లా కో-ఆర్డినేటర్ సీహెచ్ కిషన్‌స్వామి అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో మొక్కలు నాటే కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుందని తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేయడానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అందులో భాగంగా బాలికల పాఠశాలలోని ఒక్కో విద్యార్థికి ఐదు మొక్కలు పంపిణీ చేశామన్నారు. మొక్కలను పూర్తిస్థాయిలో సంరక్షించిన విద్యార్థులకు యూనిట్ పరీక్షలలో మార్కులు వేస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దశల వారిగా మొక్కలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ జల్లా కన్సల్టెంట్ వేణు, ఎంపీడీవో కరక వెంకట్రాంరెడ్డి, మండల విద్యాధికారి మియాపురం మధుసుదనాచారి, జగన్‌మోహన్‌రెడ్డి, జేఈ సత్యప్రకాశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు, మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కిషన్‌స్వామి

గన్నేరువరం: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో మండల ప్రత్యేక అధికారి కిషన్‌స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం హరితహారంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌స్వామి మాట్లాడుతూ హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, సమన్వయంతో పని చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులను భాగస్వాములను చేసి హరితహారాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధిహామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు కలిసి మండలంలోని అన్ని గ్రామాలకు అవసరమయ్యే మొక్కలను ఎల్ఎండీలోని నర్సరీ నుంచి సరఫరా చేయాలని సూచించారు. మండల కేద్రంలోని జడ్పీ పాఠశాలకు పూల మొక్కలు అందించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య కోరారు. సమావేశంలో ప్రత్యేకాధికారి కిషన్‌స్వామి, స్వచ్ఛభారత్ ప్రతినిధి వేణుప్రసాద్, ఇసి బాలలింగం, కార్యదర్శులు నరసింహారెడ్డి, శ్రీనివాస్, విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలి

● **స్వచ్ఛ భారత్ జిల్లా ప్రతినిధి కిషన్‌స్వామి**

గన్నేరువరం: వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స్వచ్ఛభారత్ జిల్లా ప్రతినిధి కిషన్‌స్వామి శుక్రవారం అన్నారు. మండల కేంద్రంలో జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఆగస్టు 8 నుంచి 15 వరకు స్వచ్ఛ భారత్ సేవా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాల విద్యార్థులు, ఐకెపీ, పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశా, స్వశక్తి సంఘాల సభ్యులతో బహిరంగ మలవిసర్జన మానాలని మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా స్వచ్ఛభారత్ ప్రతినిధులు కిషన్‌స్వామి, వేణుప్రసాద్, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య సుభాష్, ఈసీ బాలలింగం, పంచాయతీ కార్యదర్శులు పీవీ నరసింహారెడ్డి, వి శ్రీనివాస్, టెన్నికల్ అసిస్టెంట్ రమేశ్, ఐకెపీ, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వశక్తి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మానకొండూర్: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కరక వెంకట్రాంరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, డివిజన్‌స్థాయి అధికారులు విధిగా హజరు కావాలని సూచించారు.

కోదండరాం అరెస్టు విచారకరం

శంకరపట్నం: రాజకీయ జేఏసీ చైర్మన్ కోదండరాంను పోలీసులు అరెస్టు చేయడం విచారకరమని మానకొండూర్ నియోజకవర్గ జేఏసీ ఇన్‌చార్జి కనుకం కుమార్ శుక్రవారం అన్నారు. అమర వీరుల స్ఫూర్తి యాత్రలో భాగంగా ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి ప్రయత్నించడం కూడా ప్రభుత్వం నేరంగా భావించడం సరికాదన్నారు. కోదండరాంను పోలీసులు ఏకపక్షంగా అరెస్టు చేయడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు.

విద్యుత్ అంతరాయం

తిమ్మాపూర్: మండలంలోని అల్గునూర్, మన్నెంపల్లి, రేణికుంట, నుస్తులాపూర్, నల్లగొండ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అల్గునూర్, నుస్తులాపూర్ ఏఈలు రవీందర్, మల్లేశం తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముగిసిన కేంద్ర ప్రభుత్వ శిక్షణా శిబిరం

తిమ్మాపూర్: మండలంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థులకు 21 రోజులుగా జరుగుతున్న శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన శిక్షణ శిబిరం ద్వారా విద్యార్థులు పూర్తిస్థాయిలో స్వంతంగా పరిశ్రమలను స్థాపించేందుకు ముందుకు రావాలన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను స్వయంగా స్థాపించేందుకు శిక్షణ శిబిరాన్ని నిర్వహించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కె వెంకట్రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మంత్, వైస్ ప్రిన్సిపాల్ బుగ్గారావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు తెగి పడిన విద్యుత్ తీగలు

శంకరపట్నం: కేశవపట్నం ప్రధాన రహదారి సమీపంలో శుక్రవారం రాత్రి 11కేవీ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగిపడడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. విద్యుత్ తీగలు ద్విచక్ర వాహనంపై పడడంతో పాక్షికంగా కాలిపోయింది. ఈ సంఘటనతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఆలయంలో ప్రత్యేక పూజలు

గన్నేరువరం: మండలంలోని పారువెల్ల శ్రీలక్ష్మిగణపతి దేవాలయంలో శ్రావణ శుక్రవారం, సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో గణపతి హోమాన్ని నిర్వహించారు. కుంకుమ పూజలు, అర్చనలు చేశారు. గణపతికి అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తజన మండలి ఆధ్వర్యంలో సంకష్ట చతుర్థి వేడుకలు నిర్వహించారు.

గణేష్ వేడుకలు

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

గన్నేరువరం: మండల ప్రజలు గణేష్ వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై బిల్లా కోటేశ్వర్ శుక్రవారం సూచించారు. మండపాల నిర్వాహకులు ముందుగా పోలీస్‌స్టేషన్‌లో పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. ప్రతి మండపానికి విద్యుత్ మీటర్‌ను వాడాలని సూచించారు. కార్యక్రమంలో నగునూరి శంకర్, మీసం రాములు, జీల ఎల్లయ్య, కల్లెపల్లి మల్లయ్య, గంట గౌతమ్, గర్శకుర్తి శేఖర్, మంగరపు సాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల అందజేత

తిమ్మాపూర్: మండలంలోని మన్నెంపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్థానిక ఎంపీపీ బూడిద ప్రేమలత శుక్రవారం యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాంలు అందిస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో మన్నెంపల్లి సర్పంచ్ గడ్డం సుగుణ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, నాగభూషణం, హెచ్ఎం టి కవిత తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

● **బీజేపీ జిల్లా కార్యదర్శి భాస్కరాచారి**

మానకొండూర్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ మండల నాయకులు ఆందోళన చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కేవీ మహేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగు భాస్కరాచారి మాట్లాడుతూ మహారాష్ట్ర, కర్ణాటకలు విమోచన దినోత్సవాలు అధికారికంగా నిర్వహిస్తున్నా, తెలంగాణలో నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. ఆంధ్ర పాలకులు విమోచనదినాన్ని పాటించలేదని విమర్శించిన కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ జెండా ఎగురవేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బోంగోని శ్రీనివాస్‌గౌడ్, బీజేవైయం జిల్లా ప్రధానకార్యదర్శి గుడిపాటి జితేందర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి యండీ అస్లాం, మండల ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీధర్, కార్యదర్శి యం రాజశేఖర్‌రెడ్డి, బీజేవైయం ఉపాధ్యక్షుడు రాపాక ప్రవీణ్, రజక సెల్ అధ్యక్షుడు ముక్కెర సతీష్, మాజీ ఎంపీటీసీ కనకం నాగయ్య, శ్రీనివాస్, లక్ష్మయ్య, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

